సాక్షి
నిజామాబాద్

గురువారం । 16 । నవంబర్ । 2023



తేలిన అభ్యర్థులు
అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో బరిలో నిలిచిన అభ్యర్థుల లెక్క తేలింది.

- 10లో ▸



ఫిర్యాదు చేయవచ్చు..
ఎన్నికలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులుంటే తమను సంప్రదించవచ్చని బోధన్, బాన్సువాడ ఎన్నికల పరిశీలకులు తెలిపారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
30.5 /18.5

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం నుంచి చల్లటి గాలులు వీస్తాయి. సాయంత్రం చలితీవ్రత పెరుగుతుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు డిచ్‌పల్లికి సీఎం కేసీఆర్ రాక



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రూరల్ నియోజకవర్గ కేంద్రమైన డిచ్‌పల్లికి బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ రానున్నారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని నడిపల్లిలోని గాంధీనగర్ వద్ద మైదానంలో మధ్యాహ్నం ఒంటి గంటకు జరిగే ప్రజా ఆశీర్వాద సభకు ముఖ్యఅతిథిగా సీఎం హాజరు కానున్నారు. బుధవారం సాయంత్రం రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సభ ఏర్పాట్లను దగ్గరుండి పరిశీలించారు. సభకు సమీపంలోనే అధికారులు హెలీప్యాడ్ సిద్ధం చేశారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ సుమారు 45 వేల మంది సభకు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే వెంట ఐడీసీఎంఎస్ చైర్మన్ సంబారిమోహన్, నుడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బాగిర్తి బాగారెడ్డి, కలగర శ్రీనివాస్, ఖిల్లా రామాలయం చైర్మన్ మహేందర్‌రెడ్డి, శక్కరికొండ కృష్ణ, అమీర్ ఉన్నారు.

కాంగ్రెస్‌కు తప్పిన రెబెల్స్ బెడద
- నామినేషన్లు ఉపసంహరించుకున్న గంగారాం, బాలరాజు, రాజేందర్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కాంగ్రెస్ పార్టీ తరఫున టిక్కెట్లు ఆశించి తుదివరకు తీవ్ర ప్రయత్నాలు చేసి విఫలమై, రెబెల్స్‌గా నామినేషన్లు దాఖలు చేసిన సొదాగర్ గంగారాం, కాసుల బాలరాజు, గోర్త రాజేందర్‌లు చివరిరోజైన బుధవారం ఉపసంహరించుకున్నారు. టికెట్టు ఆశించి భంగపడిన మాజీ ఎమ్మెల్యే సొదాగర్ గంగారాం జుక్కల్ నియోజకవర్గం నుంచి నామినేషన్ దాఖలు చేశారు. దీంతో పార్టీ అభ్యర్థి లక్ష్మీకాంతరావు పరేషాన్ అయ్యారు. అధిష్టానం హామీతో గంగారాం ఉపసంహరించుకోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. బాన్సువాడ నుంచి టికెట్టు ఆశించి విఫలమైన కాసుల బాలరాజు సైతం రెబెల్‌గా నామినేషన్ దాఖ లు చేశారు. ఒకదశలో బాలరాజు టికెట్టు రాకపోవడంతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆస్పత్రిలో చికిత్స ద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. పార్టీ అధికారంలోకి వచ్చాక తగిన ప్రాధాన్యం కల్పిస్తామని కీలక నేతలు హామీ ఇవ్వడంతో బాలరాజు నామినేషన్ విత్‌డ్రా చేసుకున్నారు. ఆర్మూర్ నుంచి టికెట్టు ఆశించి ఢిల్లీ స్థాయిలో గట్టి ప్రయత్నాలు చేసి విఫలమైన సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు గోర్త రాజేందర్ సైతం రెబెల్‌గా దాఖలు చేసిన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. వీరు ముగ్గురూ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషిచేస్తామని ప్రకటించడం గమనార్హం.

గురుకృప ఇండస్ట్రీస్ సీజ్
నిజామాబాద్‌నాగారం : కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశాల మేరకు బుధవారం నిజామాబాద్ రూరల్ మండల పరిధిలోని ఖానాపూర్‌లో ఉన్న గురుకృప ఇండస్ట్రీస్‌ను విద్యుత్‌శాఖ ఎస్ఈ రవీందర్ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. నాలుగేళ్లుగా ఇండస్ట్రీస్ ప్రతినిధులు రూ. 57,57,667 కరెంటు బిల్లులు చెల్లించకపోవడంతో సీజ్ చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హరీష్‌రెడ్డి, డీఈ ఉత్తమ్ కుమార్, ఎస్ఏవో రాజశేఖర్, ఏడీఈ ఆర్ బాలేష్‌కుమార్, అకౌంట్ ఆఫీస్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు

బోధన్‌లో జరిగిన సభకు హాజరైన ప్రజలు

నిజాంసాగర్‌కు ఏడాదంతా నీళ్లు

బీడీ కార్మికులందరికీ పెన్షన్ ఇస్తాం

- పదేళ్లలో ఎలాంటి మతకల్లోలాలు లేవు
- ఓటు వేసేటప్పుడు పార్టీల చరిత్ర చూడాలి
- ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

ఖలీల్‌వాడి, నిజామాబాద్‌నాగారం : వేల ఎకరాలకు నీళ్లందిస్తున్న నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లో ఏడాదంతా నీళ్లుండేలా చూస్తామని, బీడీ కార్మికులకు ఉన్న 2014 కటాఫ్‌ను తొలిగించి అందరికీ పెన్షన్ అందిస్తామని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో అర్బన్ బీఆర్ఎస్ అభ్యర్థి బిగాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ మాట్లాడారు. బీడీ టేకేదార్లకు, ప్యాకర్లకు పెన్షన్ అందిస్తామన్నారు. కేవలం తెలంగాణలోనే బీడీ పింఛన్లు ఇస్తున్నామన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధు తీసేస్తారని, మూడు గంటలే కరెంట్ ఇస్తారన్నారు. నిజాంసాగర్ ద్వారా ఉమ్మడి జిల్లాలో ఏడాదంతా సాగునీరందించేందుకు కాళేశ్వరం లింకు ఏర్పాటు చేశామన్నారు. మల్లన్నసాగర్ నుంచి నిజాంసాగర్ కు పుష్కలంగా నీళ్లు వస్తాయన్నారు. తెలంగాణ ఏర్పడినప్పుడు తలసరి ఆదాయంలో 19 స్థానంలో ఉండగా ప్రస్తుతం ఫస్ట్‌ప్లేస్‌లో ఉన్నామన్నారు. మీరు వేసే ఓటు ఐదేళ్ల వరకు తలరాతను మారు స్తుందన్నారు. పనిచేసే నాయకుడినే ఎన్నుకోవాలన్నారు. బీఆర్ఎస్ వచ్చాక పదేళ్లలో మతకల్లోలాలు ఎక్కడా లేవన్నారు. బీజేపీ ప్రభుత్వం మతచిచ్చు పెట్టి అధికారంలోకి వచ్చేందుకు చూస్తోందన్నారు. కేంద్రం మోటార్లకు మీటర్లు పెట్టడానికి ప్రయత్నిస్తే తెలంగాణ ప్రభుత్వం తిరస్కరించిదన్నారు. నిధులి వ్వని బీజేపీ నేతలు మీదగ్గరికొస్తే ప్రశ్నించాలన్నారు. జిల్లాలో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే రాష్ట్రంలోనూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు.



బిగాలను పరిచయం చేస్తున్న సీఎం కేసీఆర్

బిగాలనే గెలిపించండి..
అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని, వ్యాపారాలు పక్కనపెట్టి ప్రజలకు సేవ చేస్తున్నారని సీఎం అన్నారు. నగరంలో రూ.55 కోట్లతో నిర్మి స్తున్న కళాభారతిని ఎన్నికలయ్యాక తానే వచ్చి ప్రారంభిస్తానన్నారు. నగరంలో అండర్ గ్రౌండ్ వంతెన కట్టించామని, వైకుంఠధామాలు, మినిట్యాంక్ బండ్, డివైడర్‌లు, కొత్త సమీకృత కలెక్టరేట్ భవనం, ఐటీహాబ్‌తోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కేటీఆర్, మహేష్ బిగాల, గణేష్ గుప్తా నిరుద్యోగ యువత ఉపాధి కోసం ఐటీ హాబ్‌ను నెలకొల్పారన్నారు. 24 గంటల పాటు కరెంట్ ఇవ్వడం ద్వారా ఐటీహాబ్, పరిశ్రమలు వస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కెఆర్ సురేష్‌రెడ్డి, మేయర్ నీతూకిరణ్, ఎమ్మె ల్సీ కవిత, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ రాజేశ్వర్, నూడా చైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనచారి తదితరులు పాల్గొన్నారు.

మరింత అభివృద్ధి చేస్తా..
- బిగాల, అర్బన్ బీఆర్ఎస్ అభ్యర్థి

నగరాభివృద్ధికి శాయాశక్తుల కృషి చేశానని, మరింత అభివృద్ధి చేయడానికి మరోసారి అవకాశం కల్పించండి. సీఎం కేసీఆర్ ఇచ్చిన నిధులతోనే ఇప్పటి వరకు అభివృద్ధి చేశాను. 2018లో మరో రూ.100 కోట్లు ఇవ్వడంతో నగరంను మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాను. కళాభారతి నిర్మిస్తున్నాం. డివిజన్‌కు రూ. కోటి చొప్పున అందించాం. ప్రతిడివిజన్‌లో మౌళిక సదుపాయాలు కల్పించాం.

కేసీఆర్ అంటేనే బ్రాండ్..
- ఎమ్మెల్సీ కవిత



బోధన్: సీఎం కేసీఆర్ అంటేనే అభివృద్ధికి గుర్తు అని కాంగ్రెస్ అంటే అహంకారానికి గుర్తు అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. రాష్ట్రమంతా పింక్ వేవ్ కనిపిస్తోందన్నారు. బోధన్ సభలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రేవంత్‌రెడ్డి బందూకు పట్టుకుని ప్రజల మీదికొచ్చిన విషయాన్ని ఎవరూ మరిచిపోలేదన్నారు.ఎందుకూ పనికిరాని వాళ్లు కూడా నేడు కేసీఆర్ ముందుకొచ్చి తొడగొడతాం..మెడ కోసుకుంటామంటున్నార న్నారు. షకీల్‌ను గెలిపించాలన్నారు.

ఎంతో అభివృద్ధి చేసుకున్నాం..
- మహ్మద్ షకీల్, బోధన్ బీఆర్ఎస్ అభ్యర్థి

సీఎం కేసీఆర్ చలువతో పదేళ్ల కాలంలో నియోజక వర్గంలో రూ. 3 వేల కోట్లతో ఎన్నో అభివృద్ధి పనులు చేసుకున్నామని బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్ అన్నారు. రూ. 2 వేల కోట్లు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజల బ్యాంక్ ఖాతాలో నేరుగా జమయ్యాయన్నారు.



నగరంలోని సభలో ప్లకార్డులను ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

బోధన్ బాధ్యత నాదే..

- కాంగ్రెస్సే తెలంగాణకు శత్రువు
- రైతులంతా బీఆర్ఎస్‌కే ఓటెయ్యాలి
- బోధన్ సభలో సీఎం

బోధన్: తెలంగాణ వచ్చాక మూడోసారి ఎన్నికలకు వెళ్తున్నామని, బోధన్ అభివృద్ధి బాధ్యత తానే తీసుకుంటానని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బోధన్‌లో బుధవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి షకీల్ ఆధ్వర్యంలో బోధన్ పట్టణ శివారులోని ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ప్రసంగించారు. తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలు కర్ణాటక, మహారాష్ట్రలలో ఉన్నాయా అని ప్రశ్నించారు. మ నం బాగుండబట్టే పొరుగున ఉన్న ధర్మాబాద్ ప్రజలు తమను తెలంగాణలో కలుపుకోవాలని బతిమిలాడుతున్నారన్నారు. రాష్ట్రాన్ని 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ నాటి నుంచి నేటి వరకు తెలంగాణకు శత్రువేనన్నారు. 14 ఏళ్లు పోరాడితే విధిలేని స్థితిలో కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందన్నారు. ఆ సందర్భంలో నెలల తరబడి కొనసాగిన తెలంగాణ దీక్షల్లో బోధన్‌కు అనేకసార్లు వచ్చానని కేసీఆర్ గుర్తుచేశారు.

సమైక్య పాలనలో..

అప్పట్లో నిజాం కాలంలో కట్టిన అద్భుతమైన నిజాంసాగర్ ప్రాజెక్ట్ కింద పచ్చని పొలాలతో ఎంతో బాగుండేదని, లక్ష్మీగా నిజామాబాద్‌కు పేరొచ్చిందని, కాని సమైక్య పాలనలో ఆ లక్ష్మి మాయమైందన్నారు. నిజాంసాగర్ నీళ్లు బోధన్, బాన్సువాడ, రూరల్‌లోని డిచ్‌పల్లి, వేల్పూర్ వరకు వెళ్లేవన్నారు. అప్పట్లో జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ వద్ద నిజాంసాగర్ నీళ్ల విడుదల చేయాలని చేసిన దీక్షలకు తాను హాజరయ్యానన్నారు. ఎమ్మెల్యే షకీల్ రూ. 72 కోట్లు తీసుకొచ్చి ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కాలువలను బాగు చేశారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్ రెడ్డి మంత్రిగా ఉన్న హయాంలో కాలువలను పట్టించుకోలేదన్నారు.

షకీల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. కేసీఆర్ కొద్దిసేపు ఉర్దూలో ప్రసంగించారు. ఎమ్మెల్సీ కవిత, బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్, జిల్లా పరిషత్తు చైర్మన్ విఠల్ రావు, వైస్ చైర్‌పర్సన్ రజితయాదవ్, ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ వీఆర్‌దేశాయ్, ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతిమా, నాయకులు గిర్దావర్ గంగారెడ్డి, వీఆర్‌దేశాయ్, ఎంపీపీలు బుద్దె సావిత్రి, శ్రీనివాస్ తదితరులున్నారు.



బోధన్‌లో షకీల్‌తో కలిసి నినదిస్తున్న సీఎం కేసీఆర్

సీఎం సభ సైడ్‌లైట్స్
- మధ్యాహ్నం 1.12 గంటలకు హెలీక్యాప్టర్ బోధన్ సభా ప్రాంగణానికి వచ్చింది.
- 1:23 గంటలకు సభా వేదిక వద్దకు సీఎం బస్సులో చేరుకున్నారు.
- 1:26 గంటలకు వేదిక పైకి వచ్చారు.
- 1:31 గంటలకు సీఎం ప్రసంగాన్ని ప్రారంభించి 2 గంటలకు ముగించారు.
- 2:02 గంటలకు సభా వేదిక దిగి బస్సు ఎక్కి హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు.
- 2:08 గంటలకు హెలీక్యాప్టర్ ఎక్కి నిజామాబాద్ నగరానికి వచ్చారు.
- 2:30కు గిరిరాజ్ కళాశాల మైదానంలో సభలో సీఎం మాట్లాడారు.
- 2:57 గంటలకు స్టేజీ దిగి హెలిక్యాప్టర్‌లో ఎల్లారెడ్డికి వెళ్లారు.

– నిజామాబాద్ నాగారం/ ఖలీల్‌వాడి / బోధన్‌టౌన్

కామారెడ్డి, ఎల్లారెడ్డి రెండు కళ్ల లెక్క

- ఎల్లారెడ్డి సభలో సీఎం కేసీఆర్

సాక్షి, కామారెడ్డి/నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డి రూరల్: ''నేను కామారెడ్డిల పోటీజేస్తున్న. నాకు కామారెడ్డి, ఎల్లారెడ్డి రెండు కళ్ల లెక్క. రెండు నియోజకవర్గాల అభివృద్ధి నా బాధ్యత. రెండేళ్లలో ప్రతి మడికి సాగునీరందిస్తా. ఇక్కడ కూడా కేసీఆరే పోటీ చేస్తున్నడని అనుకుని సురేందర్‌కు ఓటు వేసి గెలిపించండి'' అని సీఎం కేసీఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎల్లారెడ్డి పట్టణంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. పార్టీ అభ్యర్థి సురేందర్‌ను గెలిపిస్తే ఊహించనంత అభివృద్ధి జరుగుతుందన్నారు. మిషన్ కాకతీయ పథకాన్ని సదాశివనగర్ చెరువులో మొదలుపెట్టామని, తట్ట మోసి పనులు ప్రారంభించానన్నారు. గోదావరి జలాలతో పోచారం ప్రాజెక్టు ఏడాది పొడవునా నిండుకుండలా ఉండబోతోందన్నారు. 1969లో నాలుగు వందల మందిని కాల్చిచంపిన కాంగ్రెస్ పాలకులు ఉద్యమాన్ని ప్రతిసారి అణిచివేసే ప్రయత్నమే చేశారని కేసీఆర్ ఆరోపించారు. గులాబీ జెండా ఊరూరా ఎగిరిన తర్వాత 2004 లో తెలంగాణ ఇస్తామని మనతో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో, దేశంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన విఠల్‌రెడ్డి అనే కళాకారుడు ఉద్యమంలో రాసి పాడిన పాటను కేసీఆర్ గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ రూపంలో పెద్ద ప్రమాదం పొంచి ఉందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

సీఎం నోరు తెరిస్తే అబద్ధాలే..

- జుక్కల్ ఎమ్మెల్యే అవినీతికి అంతులేదు
- దళితబంధులో 50 శాతం కమీషన్లు..
- బిచ్కుందలో ఎన్నికల ప్రచారంలో బండి సంజయ్

నిజాంసాగర్/బిచ్కుంద: ''సీఎం కేసీఆర్ నోరు తెరిస్తే వచ్చేవి అబద్ధాలే. నవోదయ స్కూళ్లు, మెడికల్ కాలేజీలు ఒక్కటీ కేంద్రం ఇయ్యలేదట. ఈయన ప్రగతి భవన్‌ల, ఫామ్‌హౌజ్‌ల ఇరామ్ లేకుండా కష్టపడి తెచ్చిండట. మిస్టర్ కల్వకుంట్ల కమిషన్‌రావు.... ఫాం హౌజ్ నుంచి బయటకు వచ్చి చూడు... కేంద్ర ప్రభుత్వం ఏమిచ్చిందో తెలుస్తది. భువనగిరి ఎయిమ్స్ ఇచ్చిందెవరు. తెలంగాణలోని పాత ఉమ్మడి జిల్లాల్లో 9 నవోదయ, కేంద్రీయ పాఠశాలలుంటే 35 కేంద్రీయ, నవోదయ విద్యాలయాలు ఇచ్చిందెవరు? సైనిక్ స్కూల్ మంజూరు చేసిందెవరు? కేసీఆర్ ఝూటా కోర్.. బడా చోర్' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ విమర్శించారు. బుధవారం బిచ్కుందలో బీజేపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బండి సంజయ్ హెలీకాప్టర్ ద్వారా బిచ్కుంద మండలంలోని పత్తాపూర్‌కు చేరుకున్నారు. అక్కడినుంచి బిచ్కుంద బస్టాండ్ వరకు బీజేపీ శ్రేణులు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బస్టాండ్ చౌరస్తాలో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి పసుపు బోర్డు ప్రకటించడం, ఎస్సీ వర్గీకరణకు కమిటీ వేస్తామని చెప్పడం, అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తామనడంతో సీఎం కేసీఆర్‌కు నిద్ర పట్టట్లేదన్నారు. మోటార్లకు మీటర్లు పెడితే విద్యుత్ కొనుగోళ్ల పేరిట ఎంత దోచుకున్నారో బయటపడుతుందన్న భయంతో సీఎం ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు.



మాట్లాడుతున్న బండి సంజయ్, పక్కన అరుణతార



బైక్ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ కార్యకర్తలు

జుక్కల్‌ను చూస్తే దుఃఖమొస్తోంది..

జుక్కల్ నియోజకవర్గాన్ని చూస్తే దుఃఖమొస్తోందని బండి సంజయ్ పేర్కొన్నారు. ''ఎటూ చూసినా అధ్వానమైన రోడ్లు.. చీకటి పడితే బస్సులు రావు.. అసలు మనం తెలంగాణలోనే ఉన్నామా అనిపిస్తోంది. కేసీఆర్ చెప్పిన బంగారు తెలంగాణ ఇదేనా?'' అని సంజయ్ ప్రశ్నించారు. దళిత బంధులో అంతటా 30 శాతం కమీషన్ తీసుకుంటే జుక్కల్‌లో 50 శాతం కమీషన్ తీసుకుంటున్నారని దళితులు బాధపడుతున్నారన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ పునరుద్ధరణ పనులను ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా చేస్తామని చెప్పి వదిలేశారన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే జుక్కల్‌లో పేదలందరికీ ఇళ్లు కట్టిస్తామని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందేలా చూస్తామని, కేసీఆర్ లెక్క ఇంటికొకరికి కాకుండా అర్హులందరికీ వృద్ధాప్య పెన్షన్ అందిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ జుక్కల్ నియోజకవర్గ అభ్యర్థి అరుణతార, బీజేపీ నాయకులు రాములు సేట్, గోలి స్వరూప, నరేశ్, రాజు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రేవంత్‌రెడ్డి అనుకోండి

- నేను రాష్ట్రమంతటా తిరగాల్సి ఉంటది
- పార్టీ గెలుపు కోసం శ్రమించండి
- కాంగ్రెస్ కేడర్‌కు దిశానిర్దేశం చేసిన పీసీసీ చీఫ్

సాక్షి, కామారెడ్డి: ''పీసీసీ అధ్యక్షుడిగా రాష్ట్రమంతటా తిరగాల్సి ఉంటుంది. ఒత్తిడి ఉన్నా అవకాశం దొరికినప్పుడల్లా వస్తా. ఒక్కొక్కరు ఒక్కో రేవంత్ రెడ్డి అనుకుని గడపగడపకు వెళ్లండి. పార్టీ గెలుపు కోసం కష్టపడండి. కచ్చితంగా విజయం మనదే. నిజామాబాద్‌లో షబ్బీర్‌అలీ కూడా గెలుస్తాడు. ఇద్దరం మీకు అండగా ఉంటాం'' అని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం కామారెడ్డి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఎవరి పోలింగ్‌బూత్ పరిధిలో వారు పనిచేసి, ఎక్కువ ఓట్లు తీసుకురావడానికి పోటీ పడాలన్నారు. అత్యధిక ఓట్లు తెచ్చిన బూత్ మెంబర్లతో కలిసి ఫొటో దిగడంతో పాటు వారితో కలిసి భోజనం చేస్తానన్నారు. కేసీఆర్ పాలనలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నో కష్టాలు పడ్డారని, అక్రమ కేసుల పాలయ్యారని, కొందరు జైళ్ల పాలయ్యారన్నారు. ఈసారి మనం గెలిచి కేసీఆర్‌నుంచి మిత్తితో సహా వసూల్ చేద్దామన్నారు. కేసీఆర్ మిడతల దండు, దండుపాళ్యం ముఠా, కాలకేయ ముఠాలకు బుద్ధి చెప్పాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కామారెడ్డి ప్రజల తీర్పు గురించి అంతటా ఆసక్తి ఉందన్నారు. సోనియాగాంధీ నేతృత్వంలో దివంగత సీఎం వైఎస్సార్, విద్యుత్ శాఖ మంత్రి షబ్బీర్ అలీ రైతులకు ఉచిత విద్యుత్ అందించారన్నారు. ప్రాణహిత -చేవెళ్ల ప్రాజెక్టుకు వైఎస్సార్ కామారెడ్డిలో శంకుస్థాపన చేశారని, ఆ ప్రాజెక్టును సీఎం కేసీఆర్ మూలన పడేసి ఈ ప్రాంత ప్రజలకు అన్యాయం చేశారన్న విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు.



మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, వేదికపై షబ్బీర్ అలీ, యూసుఫ్ అలీ

24 గంటల ఉచిత విద్యుత్
కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 24 గంటల పాటు నాణ్యమైన కరెంటు ఇస్తుందని, ఇళ్లకు 2 వందల యూనిట్ల ఉచిత విద్యుత్, ఐదు వందలకు గ్యాస్ సిలిండర్ ఇస్తుందన్న విషయాన్ని తెలపాలన్నారు. అప్పుడు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, ఇప్పుడు ఇల్లు లేని వారికి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇస్తామని పేర్కొన్నారు. మైనారిటీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని, 12 శాతం ఇస్తానని మోసం చేసింది మాత్రం కేసీఆర్ అన్న విషయాన్ని ముస్లిం సమాజం గుర్తించాలన్నారు. సమావేశంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ, మాజీ ఎమ్మెల్యేలు యూసుఫ్ అలీ, ఈరవత్రి అనిల్, వేం నరేందర్‌రెడ్డి, నాయకులు అరికెల నర్సారెడ్డి, మానాల మోహన్‌రెడ్డి,కైలాస్ శ్రీనివాస్‌రావ్, నేరెళ్ల శారద పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఒకేషనల్‌ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఎక్కువ



ఖలీల్‌వాడి: ఇంటర్‌లో ఒకేషనల్‌ చదివిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని డీఐఈవో రఘురాజ్‌ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఒకేషనల్‌ గ్రూప్‌ల విద్యార్థులకు, మల్టీ పర్పస్‌ హెల్త్‌ వర్కర్లకు, ల్యాబ్‌ టెక్నీషియన్‌, బాలుర కంప్యూటర్‌ సైన్స్‌ విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆన్‌ ది జాబ్‌ ట్రైనింగ్‌ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆన్‌ ది జాబ్‌ ట్రైనింగ్‌ వరం లాంటిదని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధ్యాపకులు శ్రీనివాస్‌, భాస్కర్‌, రమణ, వెంకట్‌ రాజ్‌, కిరీట సుహాసిని, అస్మ కౌసర్‌, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ స్టేట్‌ వర్కింగ్‌ కమిటీ మెంబర్‌ బి శివ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు బుధవారం తెయూ రిజిస్ట్రార్‌ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. శివ మాట్లాడుతూ.. బయోమెట్రిక్‌ ఫీజు, సెమిస్టర్‌ ఫీజుల పేరిట వర్సిటీ నిర్ణయించిన ఫీజుల కంటే అధికంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు దామ సునీల్‌, సాయి, ప్రమోద్‌, కన్న, మణికాంత్‌ పాల్గొన్నారు.

ఎన్నికల అంశాలపై ఫిర్యాదు చేయొచ్చు

సుభాష్‌నగర్‌: బోధన్‌, బాన్సువాడ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి అంశమైనా తనకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని ఎన్నికల సాధారణ పరిశీలకులు లలిత్‌ నారాయణ్‌ సింగ్‌ సందు ఒక ప్రకటనలో తెలిపారు. పై రెండు సెగ్మెంట్లలో ఎన్నికలతో ముడిపడిన ఏ విషయమైనా తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. సెలవు దినాల్లో మినహాయించి మిగతా అన్నిరోజుల్లో బోధన్‌ ఇరిగేషన్‌ అతిథి గృహంలో అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. నేరుగా కలిసేందుకు వీలుపడని వారు 8332021758 నంబర్‌కు ఫోన్‌ చేసి ఫిర్యాదులు చేయొచ్చని తెలిపారు.

జిల్లా జైలులో వైద్య శిబిరం



నిజామాబాద్‌నాగారం: జిల్లా జైలులో వైద్య, ఆరోగ్య శాఖ, సాతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఖైదీలకు బుధవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. జైలు సూపరింటెండెంట్‌ ప్రమోద్‌, డీఎంహెచ్‌వో సుదర్శనం మాట్లాడుతూ ఖైదీల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించామన్నారు. ఖైదీలతో పాటు పోలీస్‌ సిబ్బంది కూడా పరీక్షలు చేసుకున్నారు. అనిల్‌ కుమార్‌, ఎయిడ్స్‌ కోఆర్డినేటర్‌ సుధాకర్‌, జిల్లా టీబీ కోఆర్డినేటర్‌ రవిగౌడ్‌, టెక్నీషియన్స్‌ వేణు, శ్రావణ్‌, రవి పాల్గొన్నారు.

ఒకరి అదృశ్యం

ఖలీల్‌వాడి:నగరంలోని ఆర్యనగర్‌కు చెందిన శివారత్‌ శివకుమార్‌(32) అదృశ్యమైనట్లు ఎస్సై సంజీవ్‌ తెలిపారు. దుబాయ్‌లో ఇంజినీర్‌గా పని చేసే శివకుమార్‌ ఇటీవల ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆయన తల్లి విజయ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తేలిన అభ్యర్థుల లెక్క

ప్రధాన పార్టీల అభ్యర్థులు: ఆర్మూర్‌



పి వినయ్‌రెడ్డి కాంగ్రెస్‌ | పైడి రాకేశ్‌రెడ్డి బీజేపీ | ఏ జీవన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌

బాల్కొండ



ఎం సునీల్‌రెడ్డి కాంగ్రెస్‌ | ఏ అన్నపూర్ణ బీజేపీ | ప్రశాంత్‌రెడ్డి బీఆర్‌ఎస్‌

బోధన్‌



సుదర్శన్‌రెడ్డి కాంగ్రెస్‌ | మోహన్‌రెడ్డి బీజేపీ | మహ్మద్‌ షకీల్‌ బీఆర్‌ఎస్‌

నిజామాబాద్‌ రూరల్‌



భూపతిరెడ్డి కాంగ్రెస్‌ | దినేశ్‌ కులాచారి బీజేపీ | బాజిరెడ్డి గోవర్ధన్‌ బీఆర్‌ఎస్‌

నిజామాబాద్‌ అర్బన్‌



షబ్బీర్‌ అలీ కాంగ్రెస్‌ | సూర్యనారాయణ బీజేపీ | గణేశ్‌గుప్తా బీఆర్‌ఎస్‌

బాన్సువాడ



రవీందర్‌రెడ్డి కాంగ్రెస్‌ | లక్ష్మీనారాయణ బీజేపీ | శ్రీనివాస్‌రెడ్డి బీఆర్‌ఎస్‌

- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
- ఎన్నికల బరిలో 77 మంది

జంగ్‌ తెలంగాణ

సుభాష్‌నగర్‌ : జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో బరిలో నిలిచే అభ్యర్థుల లెక్క తేలింది. నామినేషన్ల ఉపసంహరణకు ముగియడంతో ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్‌ అధికారులు బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితా ప్రకటించారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసింది. జిల్లావ్యాప్తంగా 25 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం ఆరు నియోజకవర్గాల్లో 77 మంది పోటీలో ఉన్నారు. బాన్సువాడ, ఆర్మూర్‌లో కాంగ్రెస్‌ రెబల్స్‌ బరిలో నిలవగా, చివరి నిమిషంలో నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.

25 మంది నామినేషన్లు ఉపసంహరణ..

జిల్లాలో 25 మంది అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. ఈనెల 10వ తేదీ నాటికి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగియగా, 13న నామినేషన్ల పరిశీలన పూర్తయ్యింది. 15న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ కొనసాగింది. మొత్తం 128 మంది అభ్యర్థులు 230 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలనలో 26 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 102 మంది నామినేషన్లు ఆమోదం పొందగా, 25 మంది ఉపసంహరించుకున్నారు.

గుర్తుల కేటాయింపు..

గుర్తింపు పొందిన పార్టీలు మినహా మిగతా అభ్యర్థులకు ఎన్నికల రిటర్నింగ్‌ అధికారులు గుర్తులు కేటాయించారు. ఎన్నికల సంఘం మొత్తం 290 గుర్తులను అభ్యర్థులకు ఆప్షన్‌ ఇవ్వగా, అందులో అభ్యర్థి ఎంచుకున్న గుర్తులను కేటాయిస్తారు. బ్యాలెట్‌ యూనిట్‌లో అభ్యర్థి పేరు ఆధారంగా వరుస క్రమాన్ని కేటాయిస్తారు. ఆ తర్వాత ప్రాధాన్యతాక్రమంలో గుర్తులను ఆప్షన్‌ ఇస్తారు.

నియోజకవర్గాల వారీగా అభ్యర్థులు

నియోజకవర్గం	ఉపసంహరణ	బరిలో ఉన్న అభ్యర్థులు
ఆర్మూర్‌	08	13
బోధన్‌	01	14
బాన్సువాడ	10	07
అర్బన్‌	02	21
రూరల్‌	03	14
బాల్కొండ	01	08
మొత్తం	25	77



నిజామాబాద్‌ సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్‌, చిత్రంలో ఎమ్మెల్యే బిగాల, రాజ్యసభ ఎంపీ సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, మేయర్‌ నీతూకిరణ్‌

సీఎం సభతో జోష్‌

నిజామాబాద్‌ అర్బన్‌, బోధన్‌ నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్‌ సభలు విజయవంతం అయ్యాయి. సీఎం ప్రసంగంతో బీఆర్‌ఎస్‌ శ్రేణుల్లో జోష్‌ నెలకొంది.



సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బిగాల, సురేశ్‌రెడ్డి



బోధన్‌ సభలో సీఎం కేసీఆర్‌, ఎమ్మెల్సీ కవిత, జెడ్పీ చైర్మన్‌ విఠల్‌రావు

దరఖాస్తుల ఆహ్వానం

సదాశివనగర్‌: ఓపెన్‌ టెన్త్‌, ఇంటర్‌లో ప్రవేశానికి గురువారం నుంచి ధర్మారావ్‌పేట్‌ ఉన్నత పాఠశాలలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కో–ఆర్డినేటర్‌ దయానంద్‌ తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9642688577, 9959929739 నంబర్లను సంప్రదించాలని కోరారు.

డబ్బులు పట్టుబడినట్లు ప్రచారం

లింగంపేట: మండలంలో బుధవారం రాత్రి డబ్బులు పట్టుబడినట్లు ప్రచారం జరిగింది. మండల కేంద్రం సమీపంలో ఎన్నికల నిఘా సిబ్బంది వాహనాల తనిఖీల్లో భాగంగా గుర్తు తెలియని వాహనంలో డబ్బులు పట్టుబడినట్లు సమాచారం. ఈ విషయమై పోలీసు, రెవెన్యూ అధికారులను సంప్రదించగా తమ దృష్టికి రాలేదన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న డీఈవో దుర్గాప్రసాద్‌

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌) : చదువులో వెనకబడిన విద్యార్థులపై హెచ్‌ఎంలు ప్రత్యేక దృష్టి సారించాలని డీఈవో దుర్గాప్రసాద్‌ సూచించారు. బుధవారం నగరశివారులోని బోర్గాం(పి) జిల్లాపరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఉన్నతి, తొలిమెట్టు, లక్ష్య కార్యక్రమాలపై హెచ్‌ఎంలకు ప్రొజెక్టర్‌ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్‌ మాట్లాడుతూ ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై అశ్రద్ధ వహించొద్దన్నారు. పదోతరగతి ఫలితాల్లో జిల్లాను ముందంజలో ఉంచాలని, అందుకు హెచ్‌ఎంలు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో బోర్గాం(పి) హెచ్‌ఎం శంకర్‌ పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్‌ పోటీలకు ఎంపిక

డిచ్‌పల్లి: స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ (ఎస్‌జీఎఫ్‌) అండర్‌–19 జాతీయ హ్యాండ్‌బాల్‌ పోటీలకు డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గురుకుల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్‌ బి సంగీత తెలిపారు. ఇటీవల మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్‌ పోటీల్లో ప్రతిభ కనబరిచి హర్యానలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు డి నవనీత, బి వర్ష ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను డీఐఈవో రఘురాజ్‌, గురుకుల ప్రిన్సిపాల్స్‌ సంగీత, రాగలత, ఎస్‌జీఎఫ్‌ ఆర్గనైజింగ్‌ సెక్రెటరీ గంగాధర్‌, సోషల్‌ వెల్ఫేర్‌ స్పోర్ట్స్‌ కో–ఆర్డినేటర్‌ నీరజారెడ్డి, వాలీబాల్‌ అసోసియేషన్‌ జనరల్‌ సెక్రెటరీ మల్లేష్‌ గౌడ్‌, పీడీ ఉదయశీల, పీఈటీలు జ్యోత్స్న, మానస, సుజాత అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న డీఐఈవో



క్రైం కార్నర్‌

ఆలయంలో చోరీ

కామారెడ్డి క్రైం: కామారెడ్డిలోని అశోక్‌నగర్‌లో ఉన్న ఐదు గుడిల ప్రాంగణంలో చోరీ జరిగింది. ఐదుగుడిల ప్రాంగణంలో గాయత్రీ మాత, శివాలయం, శ్రీ కృష్ణ, ఆంజనేయ, సాయిబాబా ఆలయాలు ఉన్నాయి. బుధవారం ఉదయాన్నే ఆలయానికి వచ్చిన భక్తులు గాయత్రి మాత, శ్రీకృష్ణ ఆలయాల తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. క్లూస్‌ టీం బృందాలను రప్పించి ఆధారాలు సేకరించారు. మొదట పంచలోహ విగ్రహాలు చోరీకి గురయ్యాయని కాలనీలో ప్రచారం జరిగింది. పూజారి హరీశ్‌, ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ విలువైన వస్తువులను ఆలయంలో ఉంచలేదని తెలిపారు. ఒక ఆలయం నుంచి మాత్రం హుండీలోని చిల్లర నగదు చోరీకి గురైందని తెలిపారు. దగ్గరలో సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగల ఆచూకీ తెలియలేదు. విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

మహిళ మెడలో నుంచి గొలుసు..



బాధితురాలు ఎల్లవ్వ

ఆర్మూర్‌ టౌన్‌: ఆర్మూర్‌లోని మల్లారెడ్డి చెరువు సమీపంలో ఓ మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తి బంగారు గొలుసును లాక్కెళ్లాడు. వివరాలు.. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం దుబ్బా గ్రామానికి చెందిన ఎల్లవ్వ ఆర్మూర్‌లోని అరుంధతి నగర్‌లో తన కూతురు ఇంటికి భర్తతో కలిసి టీవీఎస్‌ ఎక్సెల్‌పై వస్తోంది. ఆ సమయంలో వెనుక నుంచి బైక్‌పై వచ్చిన దొంగ ఎల్లవ్వ మెడలోని మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మూడు నెలల వ్యవధిలో మల్లారెడ్డి చెరువు వద్ద మూడో సారి చైన్‌ స్నాచింగ్‌ జరిగింది.

తనిఖీల్లో నగదు స్వాధీనం



భిక్కనూరు: భిక్కనూరు సమీపంలో జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలో బుధవారం రూ.2.90లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్‌ తెలిపారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లికి చెందిన సాజిద్‌ వద్ద రూ.లక్ష పదివేలు, హైదరాబాద్‌కు చెందిన నిఖిల్‌ వద్ద రూ.1.80 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కత్తెరతో తమ్ముడిపై దాడి

ఖలీల్‌వాడి: తమ్ముడిపై కత్తెరతో దాడి చేసి అనంతరం తను కూడా పొడుచుకున్న ఘటన నగరంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. నగరంలోని నాందేవ్‌వాడకు చెందిన హన్మంతు, భీమ్‌రావు అన్నదమ్ములు. హన్మంతు మద్యానికి బానిసై తరచు తమ్ముడు భీమ్‌రావును డబ్బులు అడిగేవాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం హన్మంతు భీమ్‌రావు ఇంటికి వచ్చాడు. ఇద్దరి మధ్య డబ్బుల కోసం వాగ్వాదం జరిగింది. దీంతో హనుమంతు, భీమ్‌రావును కత్తెరతో పొడిచాడు. దీంతో చుట్టూ పక్కల అక్కడి చేరుకున్నారు. అనంతరం హన్మంతు అదే కత్తెరతో తనకు తాను పొడుచుకున్నట్లు సమాచారం. స్థానికులు ఇద్దరిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా అన్నదమ్ములు కత్తెరతో దాడి చేసుకున్నారని చెప్పారు.

అభివృద్ధి చేశాను.. ఆశీర్వదించండి

- బాన్సువాడ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



పోతంగల్‌లో మాట్లాడుతున్న బాన్సువాడ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రుద్రూర్‌: బాన్సువాడ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, మరింత అభివృద్ధి కోసం మళ్లీ గెలిపించాలని స్పీకర్‌, బాన్సువాడ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. పోతంగల్‌ మండలం బర్దీపూర్‌ తండా, కల్లూర్‌, కొడిచర్ల, పోతంగల్‌, హంగర్గా, జల్లాపల్లి ఫారం, జల్లాపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆయనకు ఘన స్వాగతం పలికారు. బర్దీపూర్‌ తండా వాసులు శ్రీనివాస్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటించి ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేశారు. కల్లూర్‌, పోతంగల్‌లో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయా గ్రామాల్లో పోచారం మాట్లాడుతూ.. కాంగ్రెస్‌, బీజేపీ నుంచి స్థానికేతరులు పోటీ చేస్తూ మభ్యపెట్టి మాటలు చెబుతున్నారని, వాటిని నమ్మి మోసపోవద్దన్నారు. ఎన్నికలు కాగానే ఒకరు ఎల్లారెడ్డికి, మరొకరు నిజామాబాద్‌కు వెళ్లిపోతారని, తాను మాత్రం ప్రజలతోనే ఉండి సమస్యలు పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఇప్పటి వరకు గ్రామాల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేవన్నారు. బీఆర్‌ఎస్‌ మండలాధ్యక్షుడు ఎజాజ్‌ఖాన్‌, జెడ్పీటీసీ శంకర్‌పటేల్‌, వైస్‌ ఎంపీపీ గంగాధర్‌ పటేల్‌, ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ రామిరెడ్డి, సిరాజ్‌ పాల్గొన్నారు.



కొడిచర్లలో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



సెల్‌ఫోన్‌ రిపేర్‌ షాపు పెట్టుకున్న అరుణ్‌ను అభినందిస్తున్న ఎస్‌బీఐ రాష్ట్ర డైరెక్టర్‌

డిచ్‌పల్లి: స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో ఇస్తున్న ఉచిత స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రాల ఎస్‌బీఐ డైరెక్టర్‌ పి విశ్వనాథ్‌రెడ్డి సూచించారు. బుధవారం డిచ్‌పల్లిలోని ఆర్‌ఎస్‌ఈటీఐను ఆయన సందర్శించి రిజిస్టర్లను తనిఖీ చేశారు. కేంద్రంలో శిక్షణ, వసతి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఎలక్ట్రీషియన్‌ బ్యాచ్‌ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. మార్కెట్‌లో ఎలక్ట్రీషియన్‌, సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్‌, రిపేరింగ్‌కు మంచి డిమాండ్‌ ఉందన్నారు. అభ్యర్థులు శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి ద్వారా జీవితంలో ఎదగాలని సూచించారు. ఆర్‌ఎస్‌ఈటీఐ, డిచ్‌పల్లిలో సెల్‌ఫోన్‌ రిపేరింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకుని ధర్పల్లిలో సొంతంగా షాప్‌ పెట్టుకుని ఉపాధి పొందుతున్న అరుణ్‌ను విశ్వనాథ్‌రెడ్డి అభినందించారు. సంస్థ డైరెక్టర్‌ సుంకం శ్రీనివాస్‌, సిబ్బంది భాగ్యలక్ష్మి రామకృష్ణ, రంజిత్‌, నవీన్‌, రవి, రఘుదీప్‌ పాల్గొన్నారు.

అంతర్జాతీయ పత్రికలో గుండారం విద్యార్థుల కవితలు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

నిజామాబాద్‌రూరల్‌: కెనడా దేశం కేంద్రంగా వెలువడే అంతర్జాతీయ బాలల మాసపత్రిక 'గడుగ్గాయి'లో నిజామాబాద్‌ రూరల్‌ మండలం గుండారం ఉన్నత పాఠశాల విద్యార్థుల కవితలు ప్రచురితమయ్యాయి. తొమ్మిదో తరగతి విద్యార్థులు లాస్య, కృష్ణవేణి,శ్రుతిరెడ్డి రచించిన 'భరోసా','మన ఓటు', 'ఓటు విలువ' అనే కవితలు ప్రచురితమయ్యాయని హెచ్‌ఎం బి అమర్‌నాథ్‌ బుధవారం తెలిపారు. పాఠశాలలో జరిగిన సమావేశంలో విద్యార్థులను, తెలుగు ఉపాధ్యాయుడు కాసర్ల నరేశ్‌రావును ఆయన అభినందించారు. ఉపాధ్యాయులు అహల్య, శ్రీపాద్‌, గిరిధర్‌, ఆరోగ్యరాజ్‌, ప్రణీత, వినోద్‌ కుమార్‌, నాందేవ్‌, నవీనాకుమారి, పుష్పలత, బాలజయంతి, కవిత, మోనీశ్‌ పాల్గొన్నారు.

ఉర్దూ విభాగంలో తన్వీర్‌కు పీహెచ్‌డీ



తన్వీర్‌ను అభినందిస్తున్న రిజిస్ట్రార్‌ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగం పరిశోధక విద్యార్థి మహమ్మద్‌ తన్వీర్‌ డాక్టరేట్‌ సాధించారు. తెయూ ఉర్దూ బీవోఎస్‌ చైర్మన్‌ మహమ్మద్‌ అబ్దుల్‌ ఖవి పర్యవేక్షణలో 'ప్రింట్‌ అండ్‌ ఎలక్ట్రానిక్‌ మీడియాలో సాంకేతిక పరిజ్ఞానం' అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. బుధవారం వైవాకు ఉస్మానియా యూనివర్సిటీ ఉర్దూ పూర్వ విభాగాధిపతి మొయిద్‌ జావీద్‌ ఎక్స్‌టర్నల్‌ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. ఆర్ట్స్‌ డీన్‌ వి త్రివేణి, ప్రొఫెసర్‌ పి కనకయ్య, ఉర్దూ హెచ్‌వోడీ మూసా ఖురేషీ పాల్గొన్నారు. తన్వీర్‌ను రిజిస్ట్రార్‌ యాదగిరి అభినందించారు.

ధాన్యం బస్తాల లారీ బోల్తా



నిజాంసాగర్‌: మహమ్మద్‌నగర్‌ మండలం గాలీపూర్‌ మూలమలుపు వద్ద బుధవారం ధాన్యం బస్తాల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. మెదక్‌ జిల్లా నుంచి బోధన్‌ రైస్‌మిల్లుకు ధాన్యం బస్తాలను తీసుకు వెళ్తున్న లారీ మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహన్ని తప్పించే క్రమంలో బోల్తా పడింది. దాంతో లారీలో ఉన్న ధాన్యం బస్తాలు రోడ్డు పక్కన పడిపోయాయి. బైక్‌ రోడ్డు పక్కకు కూరుకుపోవడంతో లారీ డ్రైవర్‌ను చితకబాదినట్లు తెలిసింది.